క్లుప్తంగా

నేడు 2 వేల మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

పర్చూరు (చినగంజాం): స్థానిక వేణుగోపాల స్వామి ఆలయం వద్ద శుక్రవారం సాయంత్రం 3 గంటలకు 2000 మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ఆలయ సభ్యులు రావువారి వెంకట శివప్రసాద్ గురువారం తెలిపారు. స్థానిక దాతలు కోట హరిబాబు, కోట శ్రీనివాసరావులు వీటికి కావాల్సిన ఆర్థిక సాయాన్ని అందించనున్నారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు దాతలు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థాన ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, కార్యనిర్వాహణాధికారి కోటిరెడ్డి తదితరులు పాల్గొనున్నట్లు తెలిపారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

అద్దంకి రూరల్: సీపీఎం ఆధ్వర్యంలో గురువారం స్థానిక భవానిసెంటర్‌లో విజయవాడ వరద బాధితులకు విరాళాలు సేకరించారు. ఆ పార్టీ మండల కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రావులపల్లి కోటేశ్వరరావు, తోట వెంకటేశ్వర్లు, కె. హనుమంతరావు, కె. శ్రీనివాసరావు, డీ. గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-కేవైసీకి 15 వరకు గడువు

జే.పంగులూరు: ఖరీఫ్ పంటలకు ఈ-కేవైసీ ప్రక్రియ మొదలైందని, ఇక రెండు వారాల గడువే ఉందని మండల వ్యవసాయాధికారి డీ సుబ్బారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పంటల బీమా పథకాన్ని అమలు చేస్తున్నాయన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో పంట నష్టం వాటిల్లిన రైతులకు ఈ పథకం ఆసరాగా నిలుస్తుందని, బీమా పొందేందుకు అన్నదాతలు తమ పంటలకు ఈ- కేవైసీ చేయించుకోవాలన్నారు. ఈనెల 15 వరకు గడువు ఉందని, ఇది పూర్తి చేయకపోతే పంటల బీమా డబ్బులు పొందలేరన్నారు. ఈ-కేవైసీ పూర్తి చేసేందుకు రైతులు ఎంత భూమిలో, ఏ పంట పండిస్తున్నారో వివరాలు వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. తమ సిబ్బంది పొలాల వద్దకు వెళ్లి ఈ-పంట నమోదుతో పాటు ఈకేవైసీ చేస్తారని, రైతు ఆధార్, మొబైల్ నెంబర్, పొలం సర్వే నంబర్‌తో పాటు పొలం నమోదు పూర్తయిన తర్వాత ఈ-కేవైసీకి వేలిముద్రలు తీసుకుంటారని తెలిపారు. రైతులు రైతు సేవా కేంద్రాలకు వెళ్లి వివరాలు సమర్పించాలన్నారు.

వరద సహాయ చర్యల్లో మున్సిపల్ ఉద్యోగులు



సహాయ కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్

చీరాల: విజయవాడలో వరద సహాయక చర్యల్లో చీరాల మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు. మున్సిపల్ ఉద్యోగులు వరద ముంపు ప్రాంతాల్లో పాల్గొని ప్రజలకు సేవలు అందిస్తున్నారని కమిషనర్ కె.చక్రవర్తి తెలిపారు. విజయవాడలోని మైత్రినగర్ 5వ వార్డులో నిలిచి ఉన్న మురుగునీటిని పారిశుద్ధ్య కార్మికుల ద్వారా శుభ్రం చేయించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్, పబ్లిక్ హెల్త్ మేస్త్రీలు, వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు వారికి కేటాయించిన పారిశుద్ధ్య వర్కర్లతో వార్డులలో నిలిచి ఉన్న మురుగు, సిల్టును ట్రాక్టర్ల ద్వారా చెత్తను తరలించారు. విజయవాడ ఐదో వార్డు పర్యవేక్షణాధికారిగా ఐఏఎస్ అధికారి అనిల్ సింఘాల్‌ను నియమించారని, అనంతపురం ఎస్ఇపిహెచ్ శ్రీనాథరెడ్డిలతో కలిసి వరదల్లో చిక్కుకున్న వారికి ఆహార ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు.

ప్రీ స్కూల్‌పై తల్లులకు అవగాహన

జే.పంగులూరు: బిడ్డల పెంపకంపై తల్లులు అవగాహన కలిగి ఉండాలని.. చిన్నప్పటి నుంచి వారిని విద్య పట్ల ఆకర్షితులను చేయాల్సిన అవసరం తల్లులపై ఉందని ఐసీడీఎస్ పంగులూరు సెక్టార్ సూపర్వైజర్ జయప్రద అన్నారు. మండలంలోని ఆరికట్లవారిపాలెం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో గురువారం ప్రీస్కూల్ కార్యక్రమంపై తల్లులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సూపర్వైజర్ జయప్రద మాట్లాడుతూ 3–6 సంవత్సరాల్లోపు పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపాలని ఆమె కోరారు. ఈ విషయంలో తల్లులు ముఖ్యమైన పాత్ర పోషించాలని, పిల్లలను ఆటపాటలతో, కథలు, బొమ్మలతో విద్య నేర్పిస్తారన్నారు. తల్లులు తమ బిడ్డలను అంగన్వాడీ సెంటర్‌కు పంపాలని ఆమె కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ భువనేశ్వరి, ఆయా మాధవి, తల్లులు పాల్గొన్నారు.

గురువుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్



అద్దంకి: ప్రధానోపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



రావినూతలలో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విద్యార్థులు , ఉపాధ్యాయులు



చెరుకూరులో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న రోటరీ సభ్యులు



అద్దంకిలో హెచ్ఎంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థినులు

- ఘనంగా గురుపూజోత్సవం
- సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఘన నివాళులు
- ఉపాధ్యాయులను సత్కరించిన విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు

చీరాల రూరల్/చీరాల టౌన్/చీరాల అర్బన్/వేటపాలెం: అజ్ఞాన మనే అంధకారాన్ని పారదోలుతూ విజ్ఞానాన్ని అందించే దివ్వెల వంటివారే ఉపాధ్యాయులని పలువురు వక్తలు కొనియాడారు. భారత రెండో రాష్ట్రపతి, భారతరత్న, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా పురస్కరించుకుని ఆయన చేసిన సేవలను కొనియాడుతూ ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం స్థానిక ఎస్ఆర్అండ్‌సీఎం హైస్కూలు క్రీడా మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వాకర్స్ అసోసియేషన్‌లో సభ్యులుగా ఉన్న ఉపాధ్యాయులు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, చుక్కా శ్రీనివాసరావు, తిరుమలశెట్టి లక్ష్మీప్రతాప్, బుర్ల చినవెంకటేశ్వర్లును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చారుగుళ్ల గురుప్రసాద్, దోగుపర్తి వెంకట సురేష్, అమరా వీరాంజనేయులు, చింతా రమేష్ వాకింగ్ సభ్యులు పాల్గొన్నారు.

➤ వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఆళ్ల సుందరరామిరెడ్డి సేవలు ఎనలేనివని ఏఆర్ఎం హైస్కూల్ హెచ్ఎం బి.సాల్మన్‌రాజు అన్నారు. గురువారం స్థానిక హైస్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆళ్ల సుందరరామిరెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు.

➤ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీరాల మెయిన్ బ్రాంచి మేనేజర్ రామానాయుడు ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. స్థానిక ఎస్‌బిఐ చీరాల బ్రాంచిలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఈపూరుపాలెం బాలికల ఉన్నత పాఠశాలలో ఇంగ్లిషు ఉపాధ్యాయురాలు గోనెళ్ల శేష వరలక్ష్మిని, ప్రముఖ కథారచయిత వడలి రాధాకృష్ణను బ్యాంకు ఉన్నతాధికారులు, అతిథులు ఘనంగా సత్కరించారు.

➤ వేటపాలెం విద్యావనరుల కేంద్రంలో ఎంఈవో ఐ పురుషోత్తం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎంఈఓలను విద్యాశాఖ సిబ్బంది, సీఆర్ఎంటీలు ఘనంగా సన్మానించారు. స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని రోటరీ కమ్యూ నిటీహాల్లో రోటరీ క్లబ్, ప్రోబస్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి చిత్రపటానికి ముందుగా పూల మాళలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె జగదీష్ బాబు, సెక్రటరీ వనమా రామకృష్ణరావు, శ్రీమంతుల లక్ష్మణరావు, శర్మ, డైరక్టర్ సీఎస్ రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గురువులకే గురువు డాక్టర్ సర్వేపల్లి..

చినగంజాం/మార్టూరు/కారంచేడు/యద్దనపూడి: గురువులకే గురువు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అని ఇంకొల్లు మండలం ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం పిడవర్తి పేరిరెడ్డి అన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

➤ పెదగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎం దేవదత్తం, ఉపాధ్యాయ సిబ్బంది సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. పాఠశాల విద్యార్థులు హెచ్ఎం ఎం దేవదత్తాన్ని శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

➤ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కారంచేడు మండలంలోని కొడవలివారిపాలెం ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఉమామహేశ్వరరావు, సీనియర్ ఉపాధ్యాయులు సబ్జెక్టులో మంచి ప్రతిభను కనపర్చిన ఇంగ్లిషు టీచర్ కే రాజు, లెక్కలు టీచర్ పి భానుప్రియలను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించి పాదాభివందనం చేసి ఆశీస్సులు తీసుకున్నారు. స్వర్ణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎంవీ సుబ్బారావు, నందిగుంటపాలెంలో హెచ్ఎం పుష్పలత, కుంకలమర్రు సీసీలో శ్యామల, నాగమణి, బాబూరావు ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, ఎం వెంకటేశ్వర్లు, హెచ్ఎంలు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

➤ విద్యార్థి దశ, దిశను మార్చేది గురువు ఒక్కడేనని పర్చూరు ఎంఈఓ సత్యనారాయణ అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకొని పర్చూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చెరుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 16 మంది ఉపాధ్యాయులను ఆయన ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్, పాఠశాల హెచ్ఎం బెంజిమన్ హనోక్, రోటరీ కార్యదర్శి కోమటి ఆంజనేయులు, రోటరీ సభ్యులు పాబోలు ఉదయభాస్కర్, నాగుబడి సుబ్బారావు, శ్రీనివాసరావు, పంబి సదానంద రెడ్డి, డీ సత్యనారాయణ, పోలిశెట్టి చంద్రశేఖర్ రావు, మున్నంగి వెంకట సుబ్బయ్య,కోట శ్రీనివాస రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

➤ పర్చూరులోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించి సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో చైర్మన్ గోరంట్ల సుబ్బారావు, ప్రిన్సిపాల్ పఠాన్ షాఫియాబేగం, డైరెక్టర్ ఏరువ సుబ్బరామిరెడ్డి, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మయ్య చౌదరి పాల్గొన్నారు.

➤ ఇంకొల్లు మండలంలోని ఆచార్య రంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎస్ శ్రీనివాసాచార్యులు అధ్యక్షతన ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. పాఠశాలలోని సీనియర్ ఉపాధ్యాయుడు తెలుగు మాస్టర్ పి రామకృష్ణను ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు సన్మానించారు. దుద్దుకూరు గ్రామ వికాస్ తరఫున ఎస్ఆర్ఐ రాయని సుబ్బరామయ్య, రాయని తిరుపతి రాయుడు, నల్లూరి వీరభద్రరావు, చెన్నుపాటి జనార్దనరావులు పాఠశాలలోని ఉపాధ్యాయులకు స్వీట్లు,పెన్‌లు బహూకరించారు. గ్రామానికి చెందిన మాదాల నారాయణ స్వామి తన మనుమరాలు కొల్లా శివప్రజ్ఞ పేరుతో విద్యార్థులకు 50 భోజన ప్లేట్‌లు అందించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ జరుగుల బాలకృష్ణ, ఉపాధ్యాయులు యూ చెంచయ్య, బీ భాస్కర్‌రావు, కే విజయకుమారి, కే శ్రీలక్ష్మి, జీ చినబాబు, యం సురేష్ బాబు, బీ రేణుకా దేవి పాల్గొన్నారు.

➤ పర్చూరులో శాతావాహన హైస్కూల్‌లో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాల కరస్పాండెంట్ తేళ్ల వెంకటరాము, డైరక్టర్ అనురంజిని ఉపాధ్యాయులను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలు మరువలేనివి..

అద్దంకి/అద్దంకి రూరల్/మేదరమెట్ల/జే.పంగులూరు: అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అద్దంకి పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలోని పాఠశాలలో హెచ్ఎం కోట అంజమ్మ సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శైలజ, జీవనజ్యోతి, శ్రీదేవి, సీతాదేవి, రేణుకాదేవి, రోజారాణి, సువర్ణలత పాల్గొన్నారు.

➤ అద్దంకి మండలం మైలవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా కమిటీ చైర్మన్ కృష్ణమూర్తి, బ్రహ్మం, ఉపాధ్యాయులువీ. రమేష్ వెంకటరావు, శ్రీనివాసరావు, పద్మావతి, డీ. లావణ్య , ఆదిలక్ష్మీ, సుబ్బాయమ్మ తదితరులు ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. బొమ్మనంపాడు జెడ్పీ హెచ్ఎస్‌లో హెచ్ఎం శ్రీనివాసమూర్తి అధ్వర్యంలో గురుపూజోత్సవం సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొవి శ్రీనివాసరావు, జ్యోతి శ్రీమన్నారాయణమూర్తి, శ్రీనివాసరావు, కురుగంటి హనుమంతరావు వరికూటి సుబ్బారావు పాల్గొన్నారు.

➤ మేదరమెట్లలోని భారత్ కాన్వెంట్ స్కూల్ డైరక్టర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో, కొరిశపాడు మండలంలోని రావినూతలలో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పించారు.

➤ జే.పంగులూరు మండలంలోని నూజెళ్లపల్లి గ్రామంలో విద్యా కమిటీ చైర్మన్ మద్దినేని శోభతో పాటు, ఉపాధ్యాయులు రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు.



పర్చూరులో రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆక్స్‌ఫర్డ్ సిబ్బంది



సెయింట్ ఆన్స్‌లో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్ జగదీష్‌బాబు



ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వాకర్స్ సభ్యులు



చీరాలలో ఆళ్ల సుందరరామిరెడ్డిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు



నూజిళ్ళపల్లి పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం జరుపుతున్న ఉపాధ్యాయులు



ఇడుపులపాడులో రాధాకృష్ణన్‌కు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



బాపట్లలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకుంటున్న జానీ బాషా



ఉత్తమ హెచ్ఎంగా అవార్డును తీసుకుంటున్న పద్మావతి



ఉత్తమ ఎస్‌జీటీగా అవార్డును తీసుకుంటున్న పావులూరి శ్రీనివాసరావు

కారంచేడు/మార్టూరు: జిల్లాస్థాయిలో విద్యార్థులకు మంచి విద్యా బోధనలు అందించడంలో మంచి ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులను ఎంపీ, ఎమ్మెల్యే, డీఈఓలు గురువారం ఘనంగా సత్కరించారు. కారంచేడు మండలం కుంకలమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న కే పద్మావతికి జిల్లాస్థాయిలో హెచ్ఎంల కేటగిరిలో అవార్డు లభించింది. కుంకలమర్రు మోయిన్ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న పావులూరి శ్రీనివాసరావును అదే వేదికపై నాయకులు, అధికారులు ఎస్‌జీటీ కోటాలో అవార్డును అందించి సత్కరించారు. స్వర్ణపాలెం ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న కే నరశింహారెడ్డిని ఎస్‌జీటీ కోటాలో ఘనంగా సత్కరించారు. వీరందరికి బాటప్లలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, డీఈఓ కే నారాయణ, డీఆర్ఓ సత్తిబాబులు మెమెంటోను అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు తీసుకున్న ఉపాధ్యాయులను ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు, యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ద్రోణాదుల ఉపాధ్యాయుడికి పురస్కారం..

మార్టూరు మండలంలోని ద్రోణాదుల ఎంపీపీ, ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయుడు షేక్ జానీ బాషా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా బాపట్లలో పురస్కారం అందుకున్నారు.



ఉత్తమ ఉపాధ్యాయుడిగా అధికారుల సత్కారాన్ని పొందుతున్న నరశింహారెడ్డి

ఈ సందర్భంగా జానీబాషాను మండలంలోని పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులు అభినందించారు.

వరద బాధితులకు చేయూత అభినందనీయం



చీరాలలో వాహనాలను జెండా ఊపి పంపిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య



చీరాలలో విజయవాడకు పంపించేందుకు సిద్ధం చేసిన మెడికల్ కిట్లు



బల్లికురవ నుంచి భోజనం తయారు చేసుకుని పంపిణీ చేస్తున్న శర్మ

చీరాల టౌన్/చీరాల అర్బన్: భారీ వర్షాల కారణంగా వచ్చిన వరదల వలన సర్వం కోల్పోయిన విజయవాడ ప్రజలకు డీఆర్‌డీఏ పొదుపు మహిళలు తమవంతుగా చేయూతనందించడం అభినందనీయమని ఎమ్మెల్యే ఎంఎం. కొండయ్య అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయం వద్ద చీరాల మండల వెలుగు గ్రామ సంఘాల నుంచి సేకరించిన 36 బస్తాల బియ్యం, 30 బిస్కెట్ ప్యాకెట్ల బాక్సులు, 50 కేజీల కందిపప్పు, 30 బాక్సులు వాటర్‌బాటిళ్లు, 30 కేజీలు బూందీ ప్యాకెట్లును చీరాల నుంచి విజయవాడకు పంపించారు. వాహనాలను ఎమ్మెల్యే జెండా ఊపి విజయవాడకు పంపించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నేతాజీ, ఏపీఎం సుబ్బారావు, మండల సమాఖ్య ప్రతినిధులు, పొదుపు సంఘాల లీడర్లు, పార్టీ నాయకులు ఉన్నారు. అలానే జాండ్రపేట నుంచి పలువురు యూత్, పొదుపు మహిళలు వరద బాదితులకు ఆహార పదార్థాలను పంపించారు.

➤ విజయవాడ వరద బాధితుల సహాయార్థం అత్యవసరమైన మందులను చీరాల మెడికల్ షాపుల యజమానుల సంఘం ఆధ్వర్యంలో పంపించారు. వరదల వలన జ్వరాలు, వాంతులు, విరేచనాలు, అంటు వ్యాధులు ప్రబలే అకాశం ఉండడంతో చీరాల ప్రాంతంలోని మెడికల్ షాపుల యజమానులు ఆరు రకాల మందులతో కూడిన వెయ్యి మెడికల్ కిట్లు తయారు చేశారు. కిట్లను డ్రగ్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి ద్వారా వరద ముంపు ప్రాంతాలకు తరలించారు. అలాగే ప్రజలు తమకు తోచినంత సాయం అందించాలని వారు కోరారు.

2 వేల మందికి భోజనం ప్యాకెట్ల పంపిణీ..

బల్లికురవ: బ్రాహ్మణ సంఘం అర్చక సమాఖ్య ఆధ్వర్యంలో వరదల్లో చిక్కుకున్న విజయవాడలోని బాధితులకు ఆహారం పంపిణీతో చేయూత నిస్తున్నట్లు మండల అర్చక సమాఖ్య, బ్రాహ్మణ సేవా సంఘం బాధ్యుడు పీ సుబ్రహ్మణ్య శర్మ తెలిపారు. మండలంలోని చెన్నుపల్లి గ్రామంలోని రామాలయంలో గురువారం సుమారు 2 వేల మందికి ఆహారం తయారు చేసుకొని నేరుగా విజయవాడ విద్యాధరపురం ప్రాంతానికి తీసుకెళ్లి బాధితులకు, భోజనం ప్యాకెట్లు, మంచినీరు అందించారు.



హలాల్ దమ్ బార్యానీ అధ్వర్యంలో బాధితులకు పంపిణీ చేస్తున్న ప్యాకెట్లు

అద్దంకి: విజయవాడలోని వరద బాధితులకు పట్టణంలోని హలాల్ దమ్ బార్యానీ పాయింట్ ఓనర్ బాజీ గురువారం రూ.1.60 లక్షలు విలువ చేసే దమ్ బిర్యానీ, 1000 వాటర్ బాటిళ్లను తీసుకెళ్లి అక్కడ బాధితులకు పంపిణీ చేశారు. ఈ ప్యాకెట్లను ప్రత్యేక వాహనంలో పంపారు.